


**ISSN Print:** 2394-7500
**ISSN Online:** 2394-5869
**Impact Factor:** 8.4
IJAR 2022; 8(6): 509-517
www.allresearchjournal.com
Received: 22-04-2022
Accepted: 26-05-2022

**డా॥ వి. నారాయణప్ప**
**అసోసియేట్ ప్రొఫెసర్**
**ఆధునిక భారతీయ భాషలు, మరియు సాహిత్య అధ్యయన శాఖ, ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఢిల్లీ, ఇండియా**

**Corresponding Author:**
**డా॥ వి. నారాయణప్ప**
**అసోసియేట్ ప్రొఫెసర్**
**ఆధునిక భారతీయ భాషలు, మరియు సాహిత్య అధ్యయన శాఖ, ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఢిల్లీ, ఇండియా**

# తిక్కన నాటకీయత

**డా॥ వి. నారాయణప్ప**

**అమూర్త**
కవిత్రయంవారిలో పదునైదు పర్వములను భారతాంధ్రీకరణ చేసిన భాగ్యము తిక్కనకు దక్కినది. తాను కవియై, పూర్వకవులను కూడా గౌరవించిన వారిలో తిక్కన ప్రథమగణ్యుడు. తిక్కన నెల్లూరు మండలమునేలిన మనుమసిద్ధి ఆస్థానకవి. మనుమసిద్ధి దాయాదులవలన కోల్పోయిన రాజ్యమును తిక్కన తన రాజ్యతంత్రజ్ఞతలో మరల సంపాదించి పెట్టినవాడు. రాజకీయపుటెత్తులు నెరిగినవాడు. మహాభారతములో తిక్కన నాటకీయత కేవలము కథ సంభాషణ రూపమున నడుపుటలో లేదు. నాటకములో నుండెడు సంధి బంధములను దృష్టి నుంచుకొని, సన్నివేశములను కల్పించి, అందలి పాత్రల మనోవికారాదులను చిత్రించుటలో నుండును. తిక్కన భారతమును చదువుచున్నప్పుడు కథను చదువుచున్నట్లుగాక నాటకమును చూచుచున్న భావన కలుగును. తిక్కన నాటకీయత అధికముగా ఇమిడియున్న విరాటోద్యోగ పర్వములందు సందర్భోచితముగా కొన్ని పద్యములందు చర్చించాను గమనించవచ్చును.

**కీలక పదాలు:** సంధిబంధము, కళావిదుడు, మహీవల్లభుడు, భావోన్మీలనము, ఆంగికాభినయము, కవితాశిల్పము, కల్పవృక్షము, వాచకాభినయము, కవ్వడి.

## 1. తిక్కన పరిచయము
తిక్కన సోమయాజి 13వ శతాబ్దికి చెందినవాడు. తండ్రి కొమ్మన దండనాథుడు. తల్లి అన్నమ. అతని తాత మంత్రి భాస్కరుడు. మహావీరుడగు ఖడ్గతిక్కన ఇతని పెద తండ్రి కుమారుడు. ఇటువంటి ఉదాత్త సంస్కృతికి ఆట పట్టయిన వాతావరణములో పుట్టి పెరిగిన ప్రజ్ఞాశాలి తిక్కన. తిక్కన రాజ్యతంత్రము, రణతంత్రము సమానముగా నిర్వహించిన కుటుంబమునకు చెందినవాడు. తిక్కన నెల్లూరు మండలమునేలిన మనుమసిద్ధి ఆస్థాన కవి, మఱియు మంత్రి. అతని బిరుదులు ` 'కవిబ్రహ్మ', 'ఉభయ

కవిమిత్రుడు' తిక్కన తొలి రచన నిర్వచనోత్తర రామాయణము. మలి కృతి మహాభారతమునందు విరాట పర్వము మొదలు పదునైదు పర్వములు. అనగా వ్యాస సంస్కృత మహాభారతమును 83.33 శాతము, సుమధురముగా, రసమయముగా అఖిలాంధ్రులకు ఆహ్లాదము కలిగించునట్లు అద్భుతముగా ఆంధ్రీకరించినవాడు కవిబ్రహ్మ తిక్కన సోమయాజి. మూలఘటిక కేతన తిక్కనకు అంకితముగా రచించిన దశకుమార చరిత్రయందు తిక్కన వంశవర్ణన విపులముగా కలదు.

ఇచ్చట ముఖ్య చర్చనీయాంశము తిక్కన నాటకీయతయైనను తిక్కన వ్యక్తిత్వమును వెల్లడించుట కొంత అవసరము.

## 2. తిక్కన వ్యక్తిత్వము

నిర్వచనోత్తర రామాయణములో తిక్కన తాతయైన మంత్రి భాస్కరుని 'గుంటూరు విభుని'గా, 'సారకవితాభిరాముని'గా పేర్కొని, ఇట్లు స్తుతించినాడు:

"సారకవితాభిరాము గుంటూరి విభుని
మంత్రిభాస్కర మత్పితామహుని దలచి
యై నమన్ననమెయి లోకమాదరించు
పేఱ నా కృతి గుణములు పేయుసేల" (నిర్వ.1-12)

మంత్రి భాస్కరుని కవితాప్రాగల్భ్యముననైనను తన కావ్యము లోకాదరణము పొందగలదని నిర్వచనోత్తర రామాయణము నాటి తిక్కన ఆశించినట్లు తెలియుచున్నది. మహారాజు మనుమసిద్ధి తిక్కనకు రాచపదవులిచ్చినట్లు కేతన ఇట్లు చెప్పినాడు:

"అందలంబు, గొడుగు, లడపంబు, మేల్కట్టు,
చామరములు, జమిలి శంఖములును
కంబకట్లు, భూమి కానిక గాగ బెం
పెసగు రాచపదవులెల్ల బడసె" (ద.చ.1-21)

తిక్కన వైభవోపేతముగా జీవించినవాడు. 'మనుమసిద్ధి మహీవల్లభునకు గరుణారస పాత్రంబైన' వాడు.

నిర్వచనోత్తరరామాయణము రచించునాటికి తిక్కన మహేశ్వరాంఘ్రికమలధ్యానైక శీలుడు. కనుకనే అందు 'హరిహర పద్మ గర్భులను కొల్చి'నాడు. కాని భారత రచనా కాలము నాటికి అతడు హరిహరాభేద సిద్ధాంత స్థాపనాచార్యుడు. భారత రచనారంభమున ధర్మాద్వైతముతో పాటు హరిహరాద్వైత ప్రతిపాదకమైన పరతత్వమును తిక్కన ఇట్లు కొలిచినాడు:

"శ్రీయన గౌరినాబరగు చెల్వకు చిత్తము పల్లవింప భ
ద్రాయిత మూర్తియై హరిహరంబగు రూపముదాల్చి విష్ణు రూ
పాయ నమశ్శివాయ యని పల్కెడు భక్తజనంబు వైదిక
ధ్యాయిత కిచ్చమెచ్చు పరతత్త్వము గొల్చెద నిష్టసిద్ధికిన్"

తొలినాడు శైవుడైనను మలినాడు 'విష్ణురూపాయ నమశ్శివాయ' అని అనగలిగిన మహోదారుడు తిక్కన.

నిర్వచనోత్తర రామాయణమున తిక్కన ఆది కవీంద్రులను భక్తిగొల్చి వారి వలన నేను ఇంతటి మహనీయుడనైతినని చెప్పుకొన్నాడు. భారతారంభమున మాత్రము తిక్కన, సంస్కృత భారత కర్తయగు వ్యాసుని 'భవ్యకవితావేశుని'గాను, తనకు పూర్వము భారతములోని రెండున్నర పర్వములొనర్చిన నన్నయను 'కవిత్వవిశారదుడ'ని, 'విద్యాదయితుడ',ని కొనియాడినాడు. తాను కవియై, కవులనంతగా గౌరవించిన వారిలో తిక్కన ప్రథమ గణ్యుడు.

మనుమసిద్ధి దాయాదులవలన కోల్పోయిన రాజ్యమును తిక్కన తన రాజ్య తంత్రజ్ఞతతో మఱల సంపాదించి పెట్టినాడు. ఆంధ్ర చక్రవర్తియైన గణపతి దేవమహారాజుముందు తిక్కన ఓరుగంటిలో బౌద్ధ పండితులతో చర్చలుగావించి, వారిని ఓడించి, గణపతిదేవుని ప్రశంసలు పొందినాడు. అతని

సహాయముతో నెల్లూరు మండలమునకు మఱల మనుమసిద్ధిని పట్టాభిషక్తుని గావించినాడు. ఇందు రాజకీయత, స్వామిభక్తి స్పష్టమగుచున్నవి.

తిక్కన ఉదాత్తమనీషి, శిల్పరారగుడు, కళావిదుడు. ఇతని రచన నాటకీయమైనదని, 'రసాభ్యుచితబంధము' అర్థగౌరవము కలిగినదని పలువురు ప్రశంసించి యున్నారు. "నన్నయదొక ఋషి మార్గమైన తిక్కనదొక రసమార్గము" ని అభియుక్తోక్తి.

ఇట్లు తిక్కన కవితాగుణములు, వ్యక్తిత్వము స్పష్టమగుచున్నవి.

### 3. తిక్కన కవితాధార - నాటకీయత

తిక్కన శ్రవ్యకావ్యమైన భారతేతిహాసమును కావ్యలక్షణ శోభితమైన ప్రబంధముగా ఒనర్చుటయే గాక దానిని నాటకీయముగా కూడ సంతరించినాడు. తిక్కన కథను తానుగా చెప్పునట్లుగాక నాటకము నందువలె పాత్రలే మన ఎదుట నిలబడి వ్యవహరించినట్లు వారి మనోవృత్తులు భావ వికారములు అభినయ వర్ణన మూలమున మూర్తీ భవించినట్లు రచించినాడు. విరాటోద్యోగమునందలి ఏ ఘట్టమును పరిశీలించినను ఇది తేటతెల్లమగును.

ఏ కథయైనను సంవాద రూపమున నున్నపుడు నాటకీయమనిపించుకొనును. కాని సంవాదమే నాటకీయత కాదు. అది అందులో ఒక భాగము మాత్రమే. నాటకీయతకు ప్రాణమని చెప్పదగినది పాత్ర సృష్టి.

తిక్కన నాటకీయత కేవలము కథను సంభాషణ రూపమున నడుపుటలో లేదు. నాటకములో నుండెడు సంధిబంధములను దృష్టి నుంచుకొని, సన్నివేశములను కల్పించి, అందలి పాత్రల మనో వికారాదులను చిత్రించుటలో నుండును. తిక్కన భారతమును చదువు చున్నప్పుడు కథను చదువుచున్నట్లుగాక నాటకమును చూచుచున్న భావన కల్గును. అనగా రసాస్వాద జన్యమై ఆనందము కలుగును.

మహాభారతమున విభిన్న మనస్తత్వములు గల పాత్రలున్నవి. మనస్సు సందర్భోచితముగా అనేక విధములుగా వికృతులు చెందును. ఆ వికృతులకు భావములని పేరు.

ఆ భావములు శరీరము మీద పనిచేయునపుడు ఎన్నో మార్పులకు లోనగును. శాస్త్రమున వీనికన్నిటికిని 'సాత్విక భావములు', 'వ్యభిచారి భావములు' అను పేర్లు కలవు. అందును వ్యభిచారి భావములు సముద్ర తరంగముల వంటివి. మనస్తత్వవేదియగు తిక్కన ఈ సకలవిధ భావములను వర్ణించి పాత్రల మూర్తులు ప్రత్యక్షమగునట్లు చేయుటలో నేర్పరి.

భారత రచనలోని సంభాషణలు అలతి అలతిగా నుండును. సాధారణముగా పాత్రల చేత దీర్ఘోపన్యాసమును చేయించెడి అలవాటు సోమయాజికి లేదు. శ్రీకృష్ణుడు రాయబారమునకు వెళ్ళినపుడు చేసిన ఉపన్యాసమే కొంత దీర్ఘముగా నుండును. అట్టి సందర్భములు రెండు మూడు తప్ప ఎక్కువగా లేవు. సంభాషణలు చిన్నవిగా ఉన్నచో, భావములు చిక్కగా నుండి, మాటలకొక శోభ కలుగును. అదియును గాక ఉద్యోగపర్వములో భావచిత్రణకేగాని కథాంశముల ఒరవడికి ప్రసక్తి లేదు. చిత్తవృత్తుల చిత్రీకరణమే రసపోషణకు రమ్యపథము అని భావ బ్రహ్మ అభిమతము. దీనికనుగుణముగానే భారతమును తీర్చిదిద్దినాడు.

తిక్కన నాటకీయత అధికముగా ఇమిడియున్న విరాటోద్యోగ పర్వములందు సందర్భోచితముగా మనము ఈ క్రింది పద్యములందు గమనింపవచ్చును.

#### 3.1. భావోన్మీలనము

విరాట నగరమునకేగునపుడు మార్గ మధ్యమున అలసిన సుకుమారియైన ద్రౌపది ధర్మరాజుతో నిట్లనినది:

"డప్పి జనించె, వ్రేళుల పుటంబులు పొక్కదొడంగె, గోళ్ళలో
జిప్పిల జొచ్చె నెత్తురులు, చిత్తము నాకు గడున్ వశంబుగా;
దప్పుర మిచ్చటచ్చటను నాసల వచ్చితి, నెంతదవ్వొకో!
యిప్పటి భంగి నొక్కడుగు నేగెడు దానికి నోర్వ నెమ్మెయిన్"
(విరాట 1-148)

ఇందలి వ్రేళ్ళు పొక్కుట, గోళ్ళలో నెత్తురు వచ్చుట మొదలగు పదార్థములు వర్ణనల కంటె ద్రౌపదికి కల్గిన ఆయాసము, దైన్యము అను భావములపైపే మన దృష్టి కేంద్రీకృతమగును. తిక్కన దీర్ఘ సమాసములను వాడక, పొడిపొడి మాటలను ప్రయోగించి ద్రౌపది మనోగత భావములను వ్యక్తపరచెను. ఈ భావ విస్తారణము ఆంగికాభివర్ణనము మూలమున లేదు. కావ్యశిల్పమునకు, రసాశ్రయ భావోన్మీలన పద్ధతికి ఈ పద్యము చక్కని ఉదాహరణము.
తిక్కన భారతమునందంతట పాత్రల చిత్రవృత్తికి అనువగు ఆంగిక సాత్త్వికాభినయ వర్ణనము కన్పట్టుచుండును. ఇది మూల భారతము నందు మృగ్యము. తిక్కన కవితాశిల్పమునకు విశిష్టత నాపాదించు ప్రధాన వైలక్షణ్యమిదియే. అతని సజీవ పాత్ర సృష్టికి ప్రధాన సాధనమిదియే.

### 3.2. ఆంగికాభినయము

పాత్రముల ఆంగికాభినయము పాఠకులకు కన్నుల గట్టునట్లు తిక్కన సంభాషణలు రచించెను. భీష్ముడు కర్ణుని దుర్ణయము నిరూపించుచు ధృతరాష్ట్రునితో నిట్లనెను:

"ఒక్కడొకండనేకవిధ యుద్ధ జయంబులు గొన్నవారు వా
రెక్కడ నేమినేసె నితడీతని తమ్ముని గూలనేసి యు
క్కెక్కిన పార్థుపై గవిసెనే పసులాతడు గ్రమ్మజెంపగా
నక్కడ లేడె వీడు భవదాత్మజు గోల్పడె ఘోషయాత్రలోన్"
(ఉద్యోగ. 2-162)

పై పద్యములో "ఇతడు" అనినపుడు భీష్ముడు, కర్ణుని వైపు చేయి చాచును. "ఈతని తమ్ముడు" అనినపుడు దుర్యోధనుని చూపును. "అతడు" అని అర్జునుద్దేశించి పలుకునపుడు చేయి ఏటవాలుగా పయికెత్తును. "ఎక్కడ", "అక్కడ" అనునప్పుడు ఇట్లే చేయును. ఇది అంతయు ఆంగికాభినయమే.

### 3.3. పాత్ర చిత్రణము

కథలోని పాత్రలచేతనే మఱియొక పాత్రను ప్రశంసింపజేసి పాత్ర చిత్రీకరణము చేయుచుండుట తిక్కన విధానములో చెప్పుకొనదగినది. ద్రౌపది ధర్మజుని ఔన్నత్యమును కొనియాడిన సన్నివేశము ఇందుకు చక్కని ఉదాహరణము.

"ఎవ్వని వాకిట నిభమదపంకంబు
  రాజభూషణ రజోరాజి నడగు;
నెవ్వని చారిత్రమెల్లలోకములకు
  వొజ్జయై వినయంబు నొఱపు గఱపు;
నెవ్వని కడకంట నివ్వటిల్లెడు చూడ్కి
  మానిత సంపద లీనుచుండు;
నెవ్వని గుణలత లేడు వారాసుల
  కడపటి కొండపై గలయ బ్రాకు;
నతడు భూరి ప్రతాప మహాప్రదీప
దూర విఘటిత గర్వాంధకారవైరి
వీరకోటీరమణి ఘృణివేష్టితాంఘ్రి
తలుడు కేవల మర్త్యుడె ధర్మసుతుడు" (విరా. 2-191)

పై పద్యమున భాషా భావములకు చక్కని పొందిక కన్పట్టుచున్నది. నాటక రచయిత కన్న కావ్య రచయితకు పాత్రపోషణమునందు సంపూర్ణమగు దృష్టియును, దానిని నిర్వహించు సదుపాయమును ఉండును. వర్ణనాత్మక పద్ధతియైనచో పాత్రల అభినయాదులను సంపూర్ణముగా వర్ణింపవచ్చును.

అందువలన పాత్రల శీల స్వభావాదులు మన కన్నులకు గట్టినట్లుండును.

### 3.4. కవితా శిల్పము

భారత కవులలో నన్నయది కథాకథన దృష్టి. ఎఱ్ఱనది వర్ణనాత్మక దృష్టి. తిక్కనది కథాకథనము, వర్ణనాత్మకము రెండును కరగించి మూసబోసిన నాటకీయ శిల్ప దృష్టి. కావుననే వ్యాస భారతమునకు లేని శోభ, గౌరవము అతని భారతమునకు లభించినది. నాటకీయత, సంభాషణ చాతుర్యములే తిక్కన కవితా శిల్పమును ఉత్తమ భూములకు గొనిపోయినది.

"దుర్వారోద్యమ బాహు విక్రమ రసాస్తోక ప్రతాప స్ఫుర
ద్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుల్ మత్పతుల్
గీర్వాణాకృతు లేవు రిప్డు నిను దోర్లీలన్ వెసంగిట్టి గం
ధర్వుల్ మానము బ్రాణముం గొనుట తథ్యం బెమ్మెయిన్
గీచకా" (విరాట 2-55)

రౌద్రము పురుష ప్రకృతికి అలంకారమైనట్లు స్త్రీ జాతికి కాదు. గృహస్థ ధర్మమును నిర్వర్తింపవలసిన పురుషునకు ఆత్మ రక్షణార్థము క్రోధ ప్రకటనము సహజమే. ఆత్మరక్షణకై పూనుకొనిన ద్రౌపది, తన వెంటబడిన కీచకుని జడిపించుటకు చేసిన ప్రయత్నమే పై పద్యములోని విషయము. తన పతులు స్వయముగా కీచకుని ఎదిరించుటకు అనువైన సమయము కాదు. కనుక ఆధునిక స్త్రీవలె ఆమెయే ఆ ఉద్యమమునకు పూనుకొనినది. పరకాంత అని తెలిసి కూడ 'పరసతీ సంగమమున వచ్చు పాపమునకు ఓరుతునుగాని ఈ మదనబాధ సహింపలేను' అనుచున్నాడు ఆ కామశాస్త్ర కోవిదుడు కీచకుడు. హితము, మితము మరచి రతము కొఱకు ఆరాటపడుచున్నవానిని భయపెట్టుటకు ప్రయత్నించిన తీరు ఇది. "నా పతులు సురసన్నిభులు, భుజపరాక్రమ రసికతతో శత్రువీరుల నిర్మూలన విద్యలో పండితులు. వారిని ఎదిరించుటకు ఎవరికిని సాధ్యము కాదు. ఒక్కరు కాదు ఐదుగురున్నారు. నన్నవమానింప ప్రయత్నించినచో ఇపుడే తటాలున భుజ బలముతో నీ మానమును ప్రాణమును తప్పక వారించెదరు కీచకా" అని ద్రౌపది ఎంతయో ఉద్రేకముతో అనుచున్నది. శార్దూల వృత్తములో గాఢబంధ యుతముగా సంయుక్తాక్షర ప్రాసతో వెలసిన ఈ పద్యములోని ప్రతి లక్షణము రౌద్రమును వ్యక్తము చేయుచున్నది.

తిక్కన 'విక్రమ రస'మని పేర్కొనినాడు. మహాభారతములో తిక్కన రసపదమును పెక్కుమార్లు భావములకు జోడించి ప్రయోగించును. కవిబ్రహ్మ 'నవనాట్యేరసాః స్మృతాః' అను కోవకు చెందినవాడు కాదు. 'అనంతావైరసాః' అను దృక్పథము గలవాడు. అనుభవ దశలో ప్రతి భావము రసస్థితిని పొందునని ఆయన విశ్వాసము. పై పద్యములోని 'ఇప్డు' అను రూపము 'ఇపుడు' అనుదానికి కుదింపు. దీనిలో ఉకారము అను ప్రాణము (అచ్చు) లోపించినది. కీచకునితో 'నీ ప్రాణము లోపింపనున్నది' అని ద్రౌపది చెప్పిన మాట ద్వారా ధ్వనింప జేసినాడు కవిబ్రహ్మ. 'ఇప్డు...... నీ ప్రాణముంగొనుట' అను వాక్య యోజనము చేసి చూచినచో ఈ అంతరార్థము భాసించుచున్నది. పైగా; 'కీచకా' అని ద్రౌపది అతనిని సంబోధించినది. 'కీచక' మనగా లోనబోలుగా నున్న వెదురు. వట్టి వెదురును చీల్చినట్లు నా పతులు నిన్ను చీల్చి వేయగలరను ధ్వనితో కూడిన సాభిప్రాయ విశేషణమిది.

### 3.5. రసపోషణ

తన యొ ప్పెదురగన్న దగిలి యెవ్వరికైన
మలగి క్రమ్మఱ జూడవలయువాడు
తన వర్తనము విన్న మునిజనంబులకైన
నలవరించి కొనంగవలయువాడు
తన బంటుతన మాజి గనిన మార్తురకైన

బలుమాఱు నగ్గింపవలయువాడు
తన వితరణ కేళి వినిన గల్పకతరు
వులకైన దలయూప వలయువాడు
నకులు డొరులకు నశ్వశిక్షకుడు కాగ
నగునె యాతని దుస్థితి యనుదినంబు
గాంచి కన్నీరుడించుచు గడవరాని
దైవఘటనకు నొత్తు జిత్తంబులోన. (విరాట. 2-208)

సాహిత్యములో స్త్రీ సౌందర్యమును వర్ణించు పద్యములు ఎక్కువగా నుండును. పురుష సౌందర్య వర్ణన చేసిన రచనలును లేక పోలేదు కాని, అట్టివి చాల విరళము. కాగా, సౌందర్యము సద్గుణ శోభితమైనప్పుడే హృదయావర్జకముగా నుండును. భారతములో కౌంతేయులకే కాని మాద్రేయులకు ప్రాధాన్యములేదు. కీచకుడు తన్ను పరాభవించుటతో నాటి రాత్రి భీమసేనుని వద్దకు వెళ్ళి 'నన్ను ఆ విధముగా కీచకుడు పరాభవము చేయగా నీకు నిద్ర ఎట్లు పట్టినది?' అని ద్రౌపది నిలపైచి అడుగును. పతుల అశక్తతను గర్హించును. వివేకశీల గనుక వెంటనే చిత్త ప్రసన్నతతో భర్తల మహనీయతను మదికి తెచ్చుకొని ఒక్కొక్కరి గుణసంపదను స్తుతించుచు నకులుని గురించి చెప్పినదే పై పద్యములోని విషయము.

ఎదుట పడిన ఎవరైనను 'ఎవరీ అందగా'డని మఱలి చూచునంతటి సోయగము నకులునిది. ప్రత్యక్షముగా అంగాంగ చిత్రణచే కాకుండ ప్రతిచర్యవలన వస్తు గౌరవమును సూచించుట రసపోషణలో ఒక మెలకువ. నకులుడు మునులకు సైతము ఆదర్శప్రాయమైన శీలము గలవాడు. యుద్ధములో శత్రువులచేత పొగడ్తలందుటకు అర్హమైన పౌరుషము గలవాడు. శత్రువులు మెచ్చినదే సిసలైన శౌర్యము. కల్పవృక్షములకు కూడ గురుత్వము నెరపగల దానశీలము గలవాడు. ఎన్ని గుణములున్నను ఏమి ప్రయోజనము? విరాటుని అశ్వశాలలో ఊడిగము చేయవలసిన దుఃస్థితి సంభవించినది. అదే ద్రౌపదికి నిర్వేదమును కలిగించెడి విషయము. పురుషకారము కంటె దైవఘటన బలవత్తరము అను విషయము భారతములో పలుమార్లు ప్రసక్తమైనది. అట్టి వానిలో ఈ సందర్భము కూడ ఒకటి. ఇష్టజన క్లేశము వలన శోకభావము జనించును. ద్రౌపది కన్నీరు నింపుటకు కారణమదియే. కరుణ రసపోషణకు పదరచనలో శైథిల్యము, రచనలో రాగసరళి సహాయకారులుగా నుండుననుటకు ఈ పద్యము నిదర్శనము.

### 3.6. ధ్వని

"నా యొడలు చేర్చినప్పుడు
నీ యొడ లెట్లగునొ దాని నీ వెఱిగెదు న
న్నేయబలల తోడిదిగా
జేయదలంచితివి తప్పు చేసితి గంటే!" (విరాట. 2-338)

భార్య పరాభవమునకు కారకుడైన కీచకునితో భీమసేనుడనిన మాట ఇది. కీచకుని మర్దించుటకు ఉపాయమాలోచించి నాటి రాత్రి భీముడు, ద్రౌపది నర్తనశాలలోనికి వెళ్ళుట జరిగినది. కీచకుడు అలంకరించుకొని నర్తనశాలను ప్రవేశించును. భీముడు ఆచ్ఛాదితుడై ఉత్తరలీలా పర్యంకము మీద కూర్చొనినాడు. ద్రౌపది సమీపములో దాగియున్నది. మోహముతో ఉవ్విళ్ళూరుచున్న సింహబలుడు పర్యంకము మీద కూర్చొనియున్నది. సైరంధ్రి అనుకొని, ఆమె అక్కడకు వచ్చినందులకు ముచ్చటపడి ఆమెను ముట్టుకొనినాడు. వాని చేయి తాకగనే భీముని శరీరము ఉప్పొంగినది. కాని ఆగ్రహమును నిగ్రహించుకొని ఉద్విగ్న చేష్టలను అణచుకొనినాడు. వలువల చాటున ఉన్నవాడు వలలుడని తెలియక వనితయే అనుకొని, కీచకుడు ఆ స్పర్శకు పులకించిపోయాడు. రోమాంచము కలిగినది. పౌరుష చేష్టలకు, ప్రణయ చేష్టలకు అంతరము

తెలియని అరసికుడు కీచకుడు! 'సుందరీమణులు మోహముతో నాకు లంచమిచ్చెదరు. నేనే నీకు బహుమతి తీసికొని వచ్చితిని' అనుచు మతిలేని స్తుతిచేసి, అనంగలీలకు ఆహ్వానించును. అప్పుడు భీమసేనుడిట్లనెను : 'నా శరీరముతో నీ శరీరము కలిపినచో నీ తనువేమై పోవునో అది నీకు తెలియును. నన్ను సామాన్య కన్యలతో చేర్చి పలుకవద్దు అట్లనుట తప్పు'.

తిక్కన ధ్వనిపూర్వకముగా రచించిన పద్యములలో ఇది యొకటి. ఆ మాటను కీచకుడు ఊహించిన తీరువేరు, సహృదయునికి స్ఫురించెడి అర్థము వేరు. ఆమె శరీరైక్యమును కోరుకొనుచున్నదని ఆ చపలుని తలంపు. 'ముష్టియుద్ధములో నీ శరీరమును ముద్ద చేయుదు' నని వలలుని ఉద్దేశము. 'అబల' శబ్దమును తిక్కనగారు స్త్రీ పరముగా సాభిప్రాయముగా వాడుట జరిగినది. తన్ను స్త్రీగా భావించుసరికి భీమునకు క్రోధము హెచ్చినది. భీముని నోట వచ్చిన ఈ మాట చమత్కారముగా రాణించినది. వీర రౌద్ర మూర్తియైన భీముని నోట ఇట్టి పలుకులు వెలువడుట చమత్కారము! ఇందు తిక్కన నాటకీయతను అతి సమంజసముగా పోషించినాడు.

### 3.7. సంభాషణ (వాచికాభినయము)

> "నీ విట మున్ను వచ్చి తిది నిక్కము పార్థుని దొల్తగాంచితిం
> గావున మీకు నిద్దఱకు గౌరవ మొప్పగ దోడుపాటు స
> ద్భావము దీనికిం వెఱుగు దప్పక యుండగ నేర్పరించెద
> న్మీవల పెట్టు లట్ట తగ నీవును నీతడు గోరి కొండొగిన్"
> (ఉద్యోగ. 1-72)

ఉత్తరాభిమన్యుల కల్యాణముతో విరాట పర్వము ముగిసినది. కౌరవ పాండవులు స్పర్ధల దృష్ట్యా సమరము తప్పదనుకొనినారు. ఎవరి బలమును వారు పెంచుకొనెడి ఉద్యోగములో నుండిరి. అటు సుయోధనుడు, ఇటు విజయుడు ఒకే సారి బల సహాయము కొఱకు కృష్ణుని అర్థింప వచ్చిరి. మొదట వచ్చిన సుయోధనుడు, పవళించిన కృష్ణుని తల ప్రక్కనున్న ఆసనము మీద కూర్చొనినాడు. తరువాత వచ్చిన అర్జునుడు కాళ్ల వైపుననున్న ఆసనముపై కూర్చొనినాడు. ఆసీన స్థానములు వారి ప్రవృత్తులను తెలుపుచున్నవి. సుయోధనునిలో రాజసమునకు ఈడయిన ఉచితానుచిత పరిజ్ఞానము కనిపించుట లేదు. నిద్రించి లేచెడివారు మొదట కాళ్ళవైపు చూచుకొనెదరు. కృష్ణుడు అట్లే చూచినాడు. కాళ్ళవైపున కూర్చున్న కవ్వడి కనిపించినాడు. అతనిని పలుకరించి, మఱియొక వైపు చూడగా సుయోధన సార్వభౌముడు కంటబడినాడు. ఆయనను ప్రసన్నముగా పలుకరించినాడు.

వచ్చిన పనిని గుఱించి ప్రస్తావించినాడు కృష్ణుడు. సుయోధనుడు: "కయ్యమునకు సాయము చేయుమని అడుగ వచ్చితిమి. నేనే ముందుగ వచ్చితిని. మంచివారు ముందు వచ్చిన వారిని ఆదరించి సాయపడెదరు. కనుక నీవు నాకు సాయము చేయవలెను" అనినాడు. కృష్ణుడు "నీవు ముందే వచ్చితివి. కాని నేను ముందు అర్జునుని చూచితిని. అయినను మీ ఇద్దరికిని సహాయము చేయుట నా ధర్మము. దీనికేదైనను ఉపాయము ఆలోచించెదను. మీకు నచ్చినది మీరు కోరుకొనుడు" అని అనుచు 'తొలితొలి గోరి కొనం బాలుని కిందగు `అది పాడి' అని సూచించినాడు. కృష్ణుడు రాజకీయ వ్యవహార ధురంధరుడు. మీదు మిక్కిలి వాగ్మి. ఎదుటి వాని సత్త్వమును నిమిషములో నూహించి ఎత్తుకు పై ఎత్తు వేయగలడు. ఇచ్చట పాఠకులకు కృష్ణుడు, దుర్యోధనుడు, అర్జునుడు నాటక రంగస్థలము మీద ప్రత్యక్షముగా సంభాషించినట్లేగాక, కృష్ణుడు నటించిన

కపట నాటకము చాల యుక్తియుక్తముగా నున్నది. కృష్ణుడు నటించిన అంతర్నాటకము కన్న తిక్కన సోమయాజి చైతన్య నాటకీయ రచనా వర్ణనము గొప్పది.

### 3.8. రాజకీయపు టెత్తులు

"అల్లులకు మ్రింగ చేదైన హాలహలము
భంగి బొంగెడు కోపంబు మ్రింగికొనగ
నీలగళునెన్ని నిన్నెన్న బోలు నట్టి
నీవు చాలినగా కేల నెగడు టేరు" (ఉద్యోగ. 1-333)

ధృతరాష్ట్రుడు సంజయుని పాండవుల కడకు రాయబారిగా పంపెను. పాండువులపై ఆయనకు ప్రేమాభిమానములున్నవి. కాని చక్రవర్తిగా తాను తగవు తీర్చి కచ్చితముగా సభలో తీర్మానము చేయగల మనఃస్థైర్యము లేదు. అన్యాయమని అరవగలడే కాని, దానిని నివారించెడి నైతిక బలము ధృతరాష్ట్రునకు లేదు. సంజయుని రాయబారిగా పంపి ధర్మజునకు నీతి బోధ చేయించి 'ఇది మా దురదృష్టము" అనుకొనునట్లు చేయవలెనని అతని ఆరాటము. సంజయుడు ధర్మరాజు నొద్దకు వెళ్ళి, చెప్పవలసిన నీతులు వల్లించినాడు. చివర "బంధుల గురులన్ వెదకి వధించు సౌఖ్యంబేటికి" అని ప్రస్తావించి, "అల్లులు హాలహలము వంటి కోపమును మ్రింగుకొనలేదు. నీవు పరమేశ్వరునివంటి వాడవు. పరమేశ్వరుడు హాలాహలమును కంఠములో దాచుకొనినట్లు శత్రు కృతాపరాధ జన్యక్రోధమును హృదయములో దాచుకొనగలవు. శాంతమునకు నీ పేరు చెప్పి మఱియొకరి పేరు చెప్పవలెను" అని పొగడును. ఏమియు పని చేయని చోట పొగడ్త గొప్పగా పనిచేయును. వికార హేతువున్నను ధీరుడు చలింపడు. ధర్మరాజు మెల్లగా 'నీవు నన్ను విమర్శింపవలెనను కొన్నచో ధర్మాధర్మములు మాటలాడుము' అని సంజయుని నిరుత్తరుని చేయును. ఇచ్చట కవి నీలగళ శబ్దమును సాభిప్రాయముగా ప్రయోగించుటయే కాక ఇందు తిక్కన నాటకీయత ఇమిడియుండుట గమనార్హము.

### 4. ఉపసంహారము

నేను రచించిన 'తిక్కన నాటకీయత' అను వ్యాసమునందు కేవలము తిక్కన నాటకీయతయే కాక, అతని రచనాశైలి, రసాభ్యుచిత బంధము కూడ స్పృశింపబడినవి. తిక్కన నాటకీయతను తిరుపతి వేంకటకవులు తమ భారత నాటకములలో యథాతథముగా అనుసరించినారు.

తెలుగు సాహిత్య కళాకారులకు తెలియని ఆంధ్ర సాహిత్య రూపురేఖలను వెలుగులోనికి తెచ్చి, అచ్చతెనుగు పద గుంఫనములు కానుకగా ఆంధ్రులకందించి, కవుల పాలిట కల్పవృక్షమై, తెలుగు భాషా సహృదయులయందు తిక్కన శాశ్వతముగా నిలచిపోయెను. కలకాలము పచ్చగా తెలుగు సాహిత్యము పరవళ్ళు తీయవలెనని ఆశించిన ఆ రసమయ సాహిత్య వేత్తకు మనమెంతయో ఋణపడియున్నవారము. నేటి మన సాహిత్యము ఇంత వెలుగులోనికి వచ్చుటకును, ఆ వెలుగును పలువురు దర్శించుటకును కారణము ఆ సాహిత్య చైతన్యకారుడే. ఆ వెలుగును దర్శించుటకు ఎవరి శక్తి కొలది వారు ప్రయత్నము చేయుదురు. ఆ వెలుగు తరిగెడిది కాదు, తరింపజేసెడిది. ఆ వెలుతురు ప్రసరించుచున్నంత కాలము తెలుగు ప్రపంచము తేజస్వంతమగును. ఆయన వచస్సు తెలుగు తేజస్సు. ఇట్టి తిక్కన సాహిత్యము నేటి కవులకు కవితా విమర్శకులకు ఉపయుక్తము కాగలదని నా అభిప్రాయము.

### 5. ఆధార గ్రంథములు

1. తెలుగు సాహిత్య సమీక్ష (మొదటి సంపుటము) –

డా. జి.నాగయ్య.

2. ఆంధ్ర మహాభారతము - కవిత్రయము - డా. దివాకర్ల వేంకటావధాని.
3. ఆంధ్ర మహాభారతోపన్యాసములు (తిక్కన విరాట పర్వము) - శ్రీ కోరాడ రామకృష్ణయ్య.
4. తిక్కన చేసిన మార్పులు - ఔచిత్యపు తీర్పులు (విరాటోద్యోగ పర్వములు) - డా.పి.సుమతీ నరేంద్ర.
5. తిక్కన రసభారతి - డా. ఎల్లూరి శివారెడ్డి.